# రజకుల అభివృద్ధికి కృషి

**మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల**



తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి మావురపు నర్సింహాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, అక్టోబర్ 18 : మూసారాంబాగ్ డివిజన్‌లో రజక సంఘ భవనం అభివృద్ధికి రూ.కోటి పైనే వెచ్చించటం జరిగిందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. బుధవారం శ్రీపురం కాలనీలోని తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో నిర్మించిన ఈదమ్మ అమ్మవారి పునఃప్రతిష్ట, బొడ్రాయి, శిఖర ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు హోమం, గర్భపూజ, పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజకసంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రజక సంఘ భవనం, కమ్యూనిటీహాల్, ధోబీఘాట్ నిర్మాణాలు, భవన ప్రాంగణంలో సీసీ బెడ్ నిర్మాణానికి రూ.కోటి పైనే ఖర్చు చేయటం జరిగిందని తెలిపారు. మూసారాంబాగ్ ప్రాంత రజకులు కోరిన విధంగా అన్ని హంగులతో నిర్మించడం జరిగిందని, కమ్యూనిటీహాల్‌ను మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌గా తీర్చిదిద్దటం జరిగిందన్నారు. రజకసంఘ సభ్యులు తనను కలిసి సమస్యలను వివరించినపుడు, వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీ ప్రకారం ఈరోజు నెరవేర్చటం జరిగిందని, అందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా యాదగిరి గోవింద్‌రావు, అంబటి అశోక్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ యాదగిరి సత్తయ్య, వైస్ చైర్మన్ యాదగిరి జంగయ్య, ప్రధాన కార్యదర్శి మావురపు నర్సింహ, కోశాధికారి చెట్టుపల్లి శంకర్, కార్యదర్శులు యాదగిరి రవి, సురేందర్, సంయుక్త కార్యదర్శులు బొమ్మరాజు యాదగిరి, దోమకొండ శ్రీరాములు, బొడ్డుపల్లి యాదగిరి మైసాల లక్ష్మణ్, కార్య నిర్వాహక కార్యదర్శులు మావురపు రాజేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలకు హోంమంత్రికి ఆహ్వానం



సైదాబాద్, అక్టోబర్ 18 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్ కాలనీలోని సరస్వతి శిశు మందిరం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించే బతుకమ్మ సంబురాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని రాష్ట్ర హోంశాఖమంత్రి మహమూద్ అలీను యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఆయన కార్యాలయంలో హోంమంత్రిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి బతుకమ్మ సంబురాలకు హాజరు కావాలని కోరారు. బతుకమ్మ సంబురాలకు ఎమ్మెల్సీ కవిత, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను 5వ రోజు బుధవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని దిల్‌సుఖ్‌నగర్ కాలనీ, గడ్డిఅన్నారం కాలనీల్లో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలకు(గౌరీ మాతకు) పూజలు నిర్వహించి బతుకమ్మ ఆటలు ఆడారు. *– మలక్‌పేట, అక్టోబర్ 18*



## ఆలయాల్లో ఘనంగా నవరాత్రి వేడుకలు



మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో దేవి శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా బుధవారం మాతా మైదానంలో కొలుదీన శ్రీవిజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, అలీ శ్రావణ్‌కుమార్, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. *– సైదాబాద్, అక్టోబర్ 18*

## సామాజిక అంశాలపై అవగాహన ఉన్నవారే గొప్ప వ్యాఖ్యాతలుగా రాణిస్తారు



సమాజంలోని అంశాలపై పూర్తి అవగాహనతో పాటు పరిణతి చెందిన వారే వ్యాఖ్యాతలుగా రాణిస్తారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగసప్తస్వరం ఆధ్వర్యంలో అక్కినేని శత జయంతి వేడుకల సందర్భంగా రమణాచారి క్యాంపు కార్యాలయంలో ప్రఖ్యాత సినీ, రాజకీయ విశ్లేషకుడు ఇమంది రామారావుకు అక్కినేని రాగసప్తస్వర మానేపల్లి జువెలర్స్ రజిత పతకం ప్రదానోత్సవం బుధవారం జరిగింది. రాగసప్తస్వరం వ్యవస్థాపకురాలు రాజ్యలక్ష్మి, కార్యదర్శి అహల్య, సహాయ కార్యదర్శి సుందరవల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్, సిరి స్పందన శాస్త్రీయ గీతాలు, రమణకుమారి, సుబ్బలక్ష్మి, కస్తూరిలు భక్తి గీతాలను ఆలపించి ప్రశంసలు అందుకున్నారు. *– తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 18*

## విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



ఐడియల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్యాషన్ షోలో విద్యార్థినులు

మలక్‌పేట, అక్టోబర్ 18 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని దిల్‌సుఖ్‌నగర్ ఐడియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ అన్నారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడియల్ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఎదగాలంటే ఎంచుకున్న అంశంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సాఫ్ట్, కమ్యూనికేన్ స్కిల్స్ పెంపొందించుకొని సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్టీ కేసులో ముగ్గురికి జైలు

చాదర్‌ఘాట్, అక్టోబర్ 18 : వివిధ పెట్టీ కేసుల్లో ముగ్గురికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుల వివరాలు ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం... మూసానగర్ ప్రాంతానికి చెందిన ఫ్లవర్ డెకరేషన్ వర్కర్ మహ్మద్ ఆజం అలీ ఖాన్, మూసానగర్ ప్రాంతానికి చెందిన ఫ్లవర్ డెకరేషన్ వర్కర్ మహ్మద్ మోయిన్ ఖాన్(25), మూసానగర్ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ ఖైరాత్ పాషా(35) అనే ముగ్గురిపై పెట్టీ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆరవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ టి.ఆర్.పద్మజ వారికి నాలుగు రోజుల సాధారణ జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## మజ్లిస్ పార్టీలో చేరికలు



నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ గుడిమల్కాపూర్ భోజగుట్ట నుంచి బుధవారం పలువురు ఎంఐఎం పార్టీలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో మురాద్‌నగర్ ఏరియా ప్రెసిడెంట్ మహ్మద్, నాయకులు ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు. *– మెహిదీపట్నం, అక్టోబర్ 18*

## ప్రయాణికులకు టీఎస్‌ఆర్టీసీ దసరా కానుక

**ఎంజీబీఎస్‌లో లక్కీడిప్ స్కీం ప్రారంభం**

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 18 : రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రంగారెడ్డి రీజియన్‌లో లక్కీడిప్ స్కీంను ప్రవేశపెడుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ లక్కీడిప్ స్కీంను మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు వివరించారు. బస్సుల్లో ప్రయాణం పూర్తి చేసుకున్న ప్రయాణికులు టిక్కెట్ వెనక భాగంలో పేరు, ఫోన్ నంబర్ రాసి ఎంజీ బీఎస్‌లో మహిళల, పురుషుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలని ప్రయాణికులకు సూచించారు. ప్రతి రీజియన్‌కు ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషుల చొప్పున మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి రూ.9,900 నగదు బహుమతులను అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నిమజ్జన ఘాట్లను తక్షణమే అభివృద్ధి చేయాలి



సైదాబాద్, అక్టోబర్ 18 : బతుకమ్మ సంబురాల్లో భాగంగా సింగరేణి ఆఫీసర్స్ కాలనీలోని నిమజ్జన ఘాట్‌ను బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ ఆడిన తర్వాత మహిళలు నిమజ్జనం చేయటానికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, అందుకోసం బతుకమ్మ ఘాట్‌ను తక్షణమే అభివృద్ధి చేయాలన్నారు. నిమజ్జన ఘాట్ పరిసరా ప్రాంతాల్లో లైటింగ్, మహిళలు బతుకమ్మలతో వచ్చే దారుల్లో పూర్తిస్థాయి విద్యుత్ దీపాలను పెట్టాలని, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత వంటి అంశాల్లో తగు చర్యలు తీసుకొని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జన ఘాట్ల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సరూర్‌నగర్ చెరువులోని గుర్రపుడెక్క ఆకును తొలగించి, నిమజ్జనం సజావుగా జరిగే విధంగా తగు చర్యలు తీసుకొని పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆమె జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు.